# కర్నూలు | నంద్యాల
# వార్త
18 ఫిబ్రవరి 2026 బుధవారం పేజీలు 4


## కర్నూలులో శ్రీ సుదర్శన హోమం - భక్తులకు ఆహ్వానం



**కర్నూలు హాస్పిటల్ ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** దేశ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో కర్నూలులోని శ్రీ కృష్ణ ఆలయం నందు శ్రీ సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్నట్లు వై. నాగేశ్వరరావు యాదవ్ తెలిపారు. ఆయన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వై. నాగేశ్వరరావు యాదవ్‌తో పాటు అయ్యన్న యాదవ్, శేషిపాణి యాదవ్, శ్రీరాములు యాదవ్, డాక్టర్ ఈశ్వరయ్య యాదవ్, తిక్కన్న యాదవ్, బిజెపి నాగరాజు యాదవ్ (భారతీయ జనతా పార్టీ), రమణ యాదవ్, రాజు యాదవ్, విజయలక్ష్మి యాదవ్, పద్మావతి యాదవ్ తదితర యాదవ కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ హిందూ బంధువులందరికీ ఆహ్వానం పలికారు. నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని శ్రీ కృష్ణ దేవస్థానంలో ఫిబ్రవరి 17, 18, 19 తేదీలలో ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు "శ్రీ సుదర్శన హోమము" జరుగుతుందని తెలిపారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శ్రీ కృష్ణ ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

### మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు..
## శాస్త్రోక్తంగా.. పూర్ణాహుతి..!



**శ్రీశైలం ప్రాజెక్ట్ ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో వైభవంగా సాగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో పదోవ రోజైన మంగళవారం నాడు ఉదయం శ్రీ స్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిగాయి. తరువాత శ్రీ స్వామివారి యాగశాల యందు శ్రీ చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపారు. రుద్రహోమం, చండీ హోమం, జరిపించబడ్డాయి. తరువాత యాగ పూర్ణాహుతి, వసంతోత్సవం, ఆవబృందం, త్రిశూల స్నానం, కార్యక్రమాలు చేశారు. పూర్ణహుతి కార్యక్రమం లో శాస్త్రకత్తముగా నారి కేలాలు, పలు సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు, మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగింది. అనంతరం జరిగిన వసంతోత్సవంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, వసంతాన్ని (పసుపు సున్నం కలిపిన మంత్ర పూరిత జలం) సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు. తరువాత జరిగిన ఆవ బృంద స్నానంలో చండీశ్వర స్వామికి సర్వస్వి పుష్కరిణి వద్ద ఆగమ శాస్త్రం ప్రకారం స్నాపన కార్యక్రమం నిర్వహించబడింది. చివరగా త్రిశూల స్నాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి, శ్రీశైలం దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అధికారులు, అర్చక స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

**ధ్వజావరోహణ:** ఈబ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంకాలం ధ్వజావరోహణ కార్యక్రమం జరిపించబడింది. ఈ ధ్వజావరోహణ కార్యక్రమంలో ఉత్సవాల మొదటి రోజున బ్రహ్మోత్సవ ప్రారంభ సూచకముగా ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటం అవరోహణ చేయడం జరిగింది.

**సదస్యం నాగవల్లి:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగానే ఈరోజు నిత్య కళ్యాణ మండపంలో సదస్యం మరియు నాగవల్లి కార్యక్రమాలు జరిపించారు. సదస్యం కార్యక్రమంలో వేద పండితులచే వేద స్వస్తి నిర్వహించడం జరిగింది. వేద స్వస్తిలో వేద పండితులు చతుర్వేద పారాయణాలతో స్తోత్రాలతో శ్రీ స్వామి అమ్మవార్లను స్తుతించారు. ఆ తరువాత జరిగే నాగవల్లి కార్యక్రమంలో మహాశివరాత్రి రోజున కళ్యాణోత్సవం జరిపించబడింది. శ్రీ భ్రమరాంబా దేవి వారికి ఆగమ శాస్త్రం సాంప్రదాయం మేరకు మెట్టెలు నల్లపూసలు సమర్పించబడుతాయి.





## భక్తజనం మధ్య.. సాగిన రథోత్సవం..!

**- శివనామస్మరణతో.. మారుమోగిన నల్లమల**

**మహానంది, ఫిబ్రవరి 17, ప్రభాతవార్తః** నంద్యాల జిల్లా మహానంది పుణ్యక్షేత్రంలో ఐదురోజుల పాటు జరగిన మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం అశేష భక్తజనం మధ్య అంగరంగ వైభవంగా భక్తుల శివనామస్మరణ మధ్య రథోత్సవం నిర్వహించారు. ఉదయం ఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, శాంతరామ్ భట్, హనుమంతు శర్మ, ప్రధాన అర్చకులు అర్జున్‌శర్మలు నూతన వధువరూలైనటువంటి శ్రీకామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వారిని ప్రత్యేక పల్లకీలో తేరు వద్దకు చేర్చారు. అనంతరం నూతన వధూవరులైన స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథంలో ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలిహారణ, కుస్మాంగబలి తదితర పూజలు నిర్వహించారు. అత్యంత భక్తుల శివనామ స్మరణ మధ్య ఈవో శ్రీనివాసరెడ్డి ఆధ ్వర్యంలో జడ్జిలు అమ్మన్నరాజు, శ్రీనివాసులు, ఆర్డీవో విశ్వనాథ్, తహశీల్దార్ రమాదేవి తదితర అధికారులు, కొబ్బరికాయలు, గుమ్మడి కాయలు కొట్టి రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవం జరుగుతునంత సేపు భక్తుల స్మరణతో నల్లమల అడవి పులకించిపోయింది. రథోత్సవం జరుగుతున్నంత వరకు రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎస్ఐలు రాంమోహన్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఈవో మధు, సూపరింటెండెంట్ నీలకంటేశ్వర్‌రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర మల్లయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర ్భంగా వారు మాట్లాడుతూ అందరి సహకారంతో బ్రహ్మోత ్సవాలు విజయవంతం అయినట్లు తెలిపారు



## పొట్టలోన.. పురుగులుండు..!

- పిల్లల్లో నులి పురుగులతో జాగ్రత్త..
- చిన్నారి పొట్టల్లో ఏళ్ల తరబడి తిష్ట.. ఎదుగుదలపై ప్రభావం..
- జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాంతకం..
- అల్బెండజోల్ మాత్రల పంపిణీ..



**కోసిగి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

"పొట్టలో తిష్ట వేసి, పోషకాలను ఆరగిసూ , ఆరోగ్యాన్ని హరించే నులిపురుగులపై ఏ మాత్రం నిర్లక్ష్యం తగదు.. అవి చిన్నారుల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయి.. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారే ప్రమాదముంది.. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని ఇంటింటికి తిరిగి అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నారు ఆరోగ్య శాఖా సిబ్బంది"..

చిన్నారులు మట్టిలో ఆడి, చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేసినప్పుడు అందులో ఉండే రకరకాల నులిపురుగుల లార్వాలు నోటి ద్వారా కడుపులోకి ప్రవేశిస్తాయి..పేగుల్లో పూర్తిస్థాయి నులిపురుగులు తీవ్ర ప్రభావం చూపుతాయి.. వీరు తినే ఆహారం పేగుల్లోకి చేరినప్పుడు రక్తంలోకి చేరాల్సిన పోషకాలను నులిపురుగులే పీల్చుకోవడంతో చిన్నారుల్లో ఎదుగుదల నిలిచిపోయి వివిధ రోగాల బారిన పడుతారు. ఆకలి మందగించి ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదమూ ఉంది. అయితే అది తక్కువ శాతమే..

**ఆహార శుభ్రత అవసరమే:** కూరగాయలు, ఆకుకూరల్లోనూ వీటి గుడ్లు కలిసి పోయి కలుషితమవుతున్నాయి.. కావున కొంచెం ఉప్పు కలిపిన నీటితో శుభ్రం చేస్తే నులిపురుగుల లార్వాలతో పాటు వాటిపై ఉండే వ్యర్థాలు తొలగిపోతాయి.. వండిన ఆహార పదార్థాలను సాధ్యమైనంత వరకు వేడిగా తినడం మంచిది.. పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలి..శుద్ధి చేయని నీటిని తాగరాదు..

**మూడు రకాల నులి పురుగులు:** పిల్లల పేగుల్లో సాధారణంగా మూడు రకాల నులి పురుగులు తిష్ట వేస్తాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో ఏలికపాము(ఆస్కారిస్ లుంబ్రికాయిడ్స్), కొంకి పురుగు (అంకైలోస్టోమా డియోడెనేల్), చుట్టుపాములు (టీనియాసోలియం) అనే మూడు రకాలు ఉంటాయి. ఈ నులిపురుగులు 55 అడుగుల(17మీటర్ల)దాకా పెరిగి 25 ఏళ్లకు పైగా దెబ్బతినకుండా ఉంటాయి.. సరిగ్గా ఉడికించని పంది, గొడ్డు మాంసాల ద్వారా చుట్టు పురుగులు కడుపులోకి చేరుతాయి.. మట్టిలో ఆడితే పాదాల ద్వారా కొంకి పురుగుల లార్వాలు శరీరంలోకి ప్రవేశిస్తాయి..

**ఇలా వ్యాప్తి చెందుతాయి:** పరాన్న జీవులైన నులి పురుగులు, కొంకి పురుగులు, నట్టలు, మనిషి పేగులను ఆవాసంగా చేసుకుని నేల సంఖ్యలో గుడ్లు పెడుతాయి..

:ఆరుబయట మల విసర్జన ద్వారా మన పరిసరాల్లోకి ఈ గుడ్లు వ్యాప్తి చెందుతాయి..

: మట్టిలో కలిసిపోయిన గుడ్లు తీవ్ర వాతావరణాన్ని సైతం తట్టుకుని, రెండేళ్ల పాటు ఉంటాయి..

: మట్టిలో ఆడుకునే 5 నుంచి 19 ఏళ్ల వారిపై వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆటలు ఆడొచ్చి చేతులను శుభ్రం చేసుకోకుండా భోజనం చేయడం ద్వారా ఈ పరాన్న జీవులు మళ్లీ కడుపులోకి చేరుతాయి..

• వివరాలు 2లో

## వైభవంగా శ్రీశ్రీశ్రీ సిద్ధరుడు స్వామి రథోత్సవ వేడుకలు..!

**స్వామివారిని దర్శించుకున్న పలువురు రాజకీయ నాయకులు భారీగా హాజరైన భక్తులు**

**పెద్దకడబూరు ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ సిద్ధరుడు స్వామి రథోత్సవ వేడుకలు మంగళవారం సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య వైభవంగా జరిగాయి వేడుకలు సందర్భంగా స్వామివారికి ప్రజల వివిధ రకాల పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు సాయంత్రం గ్రామ పెద్దయిన రామలింగారెడ్డి ఇంటి నుండి పూర్ణకుంభంతో మహిళలు ఊరేగింపుగా వచ్చి స్వాములవారికి



నైవేద్యం సమర్పించారు ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేలాది మంది భక్తుల మధ్య రథోత్సవాన్ని పెద్ద బావి దగ్గరకు లాగారు రథోత్సవం లాగడానికి భక్తులు భారీగా పోటీపడ్డారు భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, టిడిపి వైసిపి నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## గోనెగండ్ల ప్రభుత్వం ఆసుపత్రి స్థాయి.. 30 పడకలకు పెంచాలి

**- ఏపీ కాంగ్రెస్ ఆధ్యక్షురాలు షర్మిలకు వినతి పత్రం**

**గోనెగండ్ల, ఫిబ్రవరి, 17, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన గోనెగండ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల స్థాయికి పెంచాలని గోనెగండ్ల మండల కాం గ్రెస్ పార్టీ కన్వీనర్ కాశీంవలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఏపీ కాంగ్రెస్ ఆధ్యక్షురాలు షర్మిలకు వినతి పత్రం అందజేశారు. గార్గేయపురంకు వచ్చిన ఏపీ కాంగ్రెస్ ఆధ్యక్షురాలు షర్మిలను గోనెగండ్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. ఆసుపత్రి దయనీయ పరిస్థితిని ఆమెకు వివరించారు. ఇందు ఆమె స్పందించి విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెలతానని తెలిపారు. ఈ సందర్భంగా కాశీంవలి మాట్లాడుతూ గతంలో గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి 30 పడకల స్థాయి ఉండేదని అయితే గత కొన్నేళ్ల క్రితం ఆరు పడకల ఆసుపత్రిగా మార్చి వేశారని ఆయన అన్నారు. మండలంలోని 28 గ్రామాల ప్రజలు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు గోనెగండ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేవారిని తెలిపారు. స్థాయిని తగ్గించడం కారణంగా వైద్యులు సిబ్బంది తగి ్గ పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మండలంలోని ప్రజలు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వసు ్తందని దీంతో ప్రాణాపాయం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. కావున ఉన్నాతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ



## పులివాహనంపై.. స్వామి అమ్మవార్ల దర్శనం

**మహానంది, ఫిబ్రవరి 17, ప్రభాతవార్తః** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులు పులివాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. మంగళవారం శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర్ శర్మ, శాంతరామ్ భట్, హనుమంతు శర్మ ఋత్వికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత ్సవం నిర్వహించారు. ఈకార్య క్రమంలో ఏఈవో మధు, సూపరింటె ఒడెంట్ సుబ్బారెడ్డి, నీలకంటేశ్వర్‌రాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, పూజారులు రాఘవశర్మ, శరబయ్య, ఏఈ శ్రీనివాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**తరలివచ్చిన భక్తులు..తరింపజేసిన అధికారులు :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా క్షేత్రానికి వచ్చిన భక్తులు ఏర్పాట్లను చూసి తరించిపోయారు. క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం ఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏఈవో మధు, సూపరింటెండెంట్ నీలకంటేశ్వర్‌రాజు, సుబ్బారెడ్డిలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేసవి ప్రారంభం కావడంతో భక్తులకు ఎండ వేడిమి తగలకుండా క్యూలైన్ల వెంట నీడ వుండేలా



పెండాల్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే దాతల సహకారంతో వాటర్ బాటిల్స్, మజ్జిగ, ఉచిత ప్రసాదం అందజేయడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. కూచిపూడి నృత్యాలు, కోలాటాలు, చెక్కభజనలు, హరికథ తదితర వాటితో భక్తులు తరించిపోయారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగలేదు. ఉత్సవాల సందర్భంగా ఆలయ గోపురాలతో పాటు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌కాంతులు భక్తులను మెప్పించజేశారు. ఆలయంలో పరిసర ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఐపిఎస్ అధికారిని డిఎస్పీ జావలి, తాలూక సిఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



## కెసికెనాల్ పరిశుభ్రతలో.. ప్రజల పాత్ర కీలకం..!



**కర్నూలు మున్సిపల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్తః** నగర పరిధిలో కెసికెనాల్‌ను పరిశుభ్రంగా పరిరక్షించడంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని నగరపాలక కమిషనర్ పి విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇంజనీరింగ్, జలవనరుల శాఖ అధికారులతో కలిసి కార్ల్‌మార్క్స్ నగర్, ఆశోక్ నగర్, వినాయక ఘాట్ ప్రాంతాల్లో కెసి కెనాల్‌ను పరిశీలించారు. కెనాల్‌లో చెత్తచేదారం పారవేయకుండా నగరపాలక సంస్థ, శానిటేషన్‌సిబ్బంది జలవనరుల శాఖ లస్కర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దెబ్బతిన ్న ప్రదేశాల్లో రక్షణవలయానికి తక్షణ మరమ్మత్తులుచేపట్టాలని అదేశించారు. కెనాల్‌లోకి డ్రైనేజి కాల్వల నీరు చేరుతున్న ప్రాంతాలను గుర్తించి వాటి మళ్లింపుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నడిబొడ్డున ప్రవహించే కెనాల్ నగరానికి అందాన్ని చేకూర్చేదిగా ఉండాలని అయితే పరిసర ప్రాంతాల ప్రజల చెత్తపారవేయడం వల్ల అపరిశుభ్ర పరిస్థితులు నెలకొనడం అవేదనకరం అన్నారు. నీట ప్రవాహం లేని సమయంలో పరిస్థితి మరింత దయనీయంగా తయారై దోమలు తదితర విషకీటకాలు విస్తరించి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతాయని తెలిపారు. ప్రజల బాధ్యతతో వ్యవహారించి ఇకపై చెత్తను నగరపాలక వాహనాలకు అప్పగించాలని కమిషనర్ కోరారు. ఈకార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, నగరపాలక సంస్థ ఎస్ఈ రమణమూర్తి, డిఈఈ ప్రసాద్, ఎంఈ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కన్నులపండుగగా బ్రహ్మగుండేశ్వరుని రథోత్సవం



**- భక్తులతో కిటకిటలాడిన బ్రహ్మగుండం...**
**- నేడు వసంతోత్సవం...**

**వెల్దుర్తి, ఫిబ్రవరి17, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలో వెలసిన బ్రహ్మగుండ పుణ్యక్షేత్రంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయకమిటీ నిర్వాహకులు బొమ్మన రాజశేఖర్‌రెడ్డి, సిఫ్‌ఓ టి.హనుమంతరావు, ఆలయ ఇఓ ఆంజనేయులు ఆధ్వర్యం లో బ్రహ్మగుండేశ్వరుని రథోత్సవ కార్యక్రమం మంగళవారం అశేషభక్తజనుల నడుమ జరిగింది. శ్రీకామేశ్వరిదేవి సహిత బ్రహేశ్వరస్వామి రథోత్సవం సాయంత్రం 6.18 నిమిషాలకు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ బ్రహ్మేశ్వరస్వామి, గంగాదేవి, గౌరీదేవి అమ్మవార్లు ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు జరిపిం చారు. రథం చుట్టూ ఉత్సవమూర్తుల ప్రదక్షిణలు చేయించి రథంపై కూర్చొబెట్టారు .వేదపండితులు, అర్చకులు శివ, నాగరాజుల మంత్రోచ్ఛరణల మధ్య అశేషజనవాహిని, శివభక్తుల హరహరమహాదేవ నామస్మరణతో బ్రహేశ్వరుని రథం ముందుకు కదిలింది. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామపెద్దలు మాజీ ఎంపిపి బొమ్మనదశరథరామిరెడ్డి, మాజీ ఎంపిపి యల్.ఇ.జ్ఞానేశ్వర్‌గౌడ్ వారి కుటుంబసభ్యులు రథానికి పూజలు చేశారు. వెల్దుర్తి సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో వెల్దుర్తి ఎస్సై నరేష్‌తో పాటు పోలీసు సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

**-నేడు వసంతోత్సం..:** శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈనెల18న బుధవారం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, రాత్రి గ్రామపురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మెన్, ఇఓలు తెలిపారు. ఈ ఉత్సవాలకు గ్రామపెద్దలు, ఆయకట్లవారు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.




# దళితులపై హత్యలు ఆపాలి..!

– లేనిపక్షంలో ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం – జై భీం ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ

**మంత్రాలయం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త;** దళితులపై హత్యలు ఆపాలని, లేనిపక్షంలో కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని జై భీం ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఫెయిల్యూర్ అయ్యి దళిత, గిరిజనులపై ఊచకోతగా హత్యలు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా రాయలసీమ కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని నాగనాథనహళ్లి గుండమ్మ, చిప్పగిరి లక్ష్మీనారాయణ, షరీఫ్‌నగర్ సంజన్న, బ




ఒందిమడుగుల టీఎం రమేష్లను ఆధిపత్యం కోసం అగ్రకులాలు అతి కిరాతకంగా చంపడం జరిగిందన్నారు. కేవలం కూటమి ప్రభుత్వం వ్యక్తిగత కక్షలకు మాత్రమే లా అండ్ ఆర్డర్ పని చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దళిత గిరిజనుల ఓట్లతోనే అధికారం చేపడితే, దళిత గిరిజనులను పిట్టల్లాగ చంపబడుతున్నారని భావిస్తూ ప్రత్యేకంగా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఇద్దరు ఎస్పీలను పెట్టి అదనపు బలగాలతో దళిత గిరిజనులకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలను ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు మొదలుకొని ముద్దాయిలకు వత్తాసు పలుకుతూ ముద్దాయిలకు సపోర్టుగా ఉంటూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుగారుస్తున్నారన్నారు. దళిత, గిరిజనులపై దాడులు ఆపి, చట్టాలను పటిష్టం చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## పొట్టలోన..పురుగులుండు..!

**(మొదటి పేజీ తరువాయి ) : శుభ్రతే ముఖ్యం :** భోజనానికి ముందు, మల విసర్జన తరువాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి..

**:చేతుల పైభాగం నుంచి అరచేతి వరకూ శుభ్రం చేసుకోవాలి..**

:పాదరక్షలు లేకుండా తిరిగితే కొంకి పురుగుల లార్వాలు అరికాలిని చీల్చుకుని లోపలికి ప్రవేశిస్తాయి..

**ప్రారంభమైన మాత్రల పంపిణి:** నులి పురుగులను నియంత్రించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 1 నుంచి 19 ఏళ్ల లోపు బాల బాలికలందరికీ ఈ నెల 3వ తేది నుండి 9వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రలను పంపిణి చేస్తున్నారు. చిన్నారులందరికీ తప్పనిసరిగా వీటిని వేయించాలని ఆయా శాఖల అధికారులు సూచిస్తున్నారు..

**నులి పురుగులను నివారిద్దాం : డాక్టర్ ఇబ్రహీం, మెడికల్ అధికారి..**

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణిని పకడ్బందిగా నిర్వహిస్తున్నాం..ప్రతి ఒక్కరికి మాత్రలు పంపిణి చేయిస్తున్నాం.. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలు కోసిగి మండలంలో సుమారు 20వేల మంది ఉన్నారు.. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయించాలి. వైద్య సిబ్బంది ద్వారా ఇంటింటికి మాత్రలు పంపిణి జరుగుతోంది. ఒక సిబ్బంది రోజుకు 50 కుటుంబాలకు అందించేలా చర్యలు చేపట్టాం..1-2 ఏళ్ల లోపు ఉన్న పిల్లలకు అర్ధమాత్ర మాత్రమే ఇవ్వాలి. జలుబు, జ్వరం ఉన్న పిల్లలకు మాత్రలు ఇవ్వకూడదు..ముఖ్యంగా పాఠశాలలోని పిల్లలకు తప్పని సరిగా వేసేందుకు చర్యలు తీసుకున్నాం.. అంతేకాక కరోనా వ్యాప్తి నేపథ్యంలో సిబ్బంది తగిన జాగ్రత్తలతో ఇంటింటికి వెళ్లి పిల్లలకు మాత్రలను అందించేలా ఏర్పాట్లు చేసాం..

## వైష్ణవి విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ..!



**ఎమ్మిగనూరు క్రైం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** ఎమ్మిగనూరు పట్టణంలోని కొండవీటి ప్రాంతంలోని వైష్ణవి అకాడమీ( జూనియర్ కళాశాల) విద్యార్థులు జేఈఈ మెయిన్స్ 2026 లో ఉత్తమ ప్రతిభ చాటారు. బుధవారం ప్రత్యేక కార్యక్రమంలో వైష్ణవి అకాడమీ చైర్మన్ జి విష్ణు ప్రభు, వైష్ణవి గ్రూప్ చైర్మన్ జిడి లింగప్ప, కరస్పాండెంట్ సత్య సిరి విద్యార్థులను అభినందించారు.వారు మాట్లాడుతూ మా విద్యార్థుల కఠోర శ్రమ, అంకితభావం, అధ్యాపకుల ఉత్తమ బోధన, ప్రణాళిక ఈ ఫలితాలు సాధించారని అన్నారు. మాపై మరింత బాధ్యత పెంచాయని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించడానికి కృషి చేస్తామన్నారు. తమ కళాశాల విద్యార్థి కే తరుణ్ 97.91తో జిల్లాలో టాపర్ ఒకరిగా, ఆదోని డివిజన్ లో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే మా విద్యార్థులు బి కృష్ణ చైతన్య 93.56, కే లక్ష్మీకాంత్ 91.92, ఎస్ కొంగతి మమత 86.83, ఎం సాయి యువరాజ్ 84.31 సాధించారు టాపర్ గా నిలిచిన కే తరుణ్ ప్రత్యేకంగా ఇంటి వద్ద కళాశాల యాజమాన్యం అధ్యాపక బృందం విద్యార్థిని పుష్పగుచ్చంతో అభినందించి, స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేసుకున్నారు.

## హోరా హోరిగా పొట్టేళ్ళ పోటీలు



**నందికొట్కూరు, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో శ్రీశ్రీశ్రీ కాశీ చంద్రమౌళీశ్వర స్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన పొట్టేళ్ళ పందాలు హోరా హోరిగా సాగాయి. మంగళవారం పోటీలను గ్రామ సర్పంచ్ జి.రవి యాదవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ పోటీలలో విజేతలుగా ఆంధ్ర కట్ల రాక్షసి,(నంద్యాల), పగిడ్యాల,మండ్లెం, ప్రాతకోట, గడివేముల గ్రామాలకు చెందిన పొట్టేళ్ళు విజేతలుగా నిలువగా మొదటి బహుమతి దాత గ్రామ సర్పంచ్ రవి యాదవ్ రూ.10 వేలు, రెండవ బహుమతి దాతలు రూ.8 వేలు జి.నాగార్జున, జి.నాగరాజు, మూడవ బహుమతి దాతలు రూ.6 వేలు గొల్ల క్రిష్ణయ్య, గొల్ల సవారి, నాలుగవ బహుమతి రూ. 4 వేలు దాతలు కీ..శే.బుగ్గన్న కుమారులు, అయిదవ బహుమతి రూ.2 వేలు దాత మద్దిలేటి నగదు బహమతులు అందజేశారు. 18న పారువేట, 19న తీర్థావలి నిర్వహించబడుతుందని గ్రామ పెద్దలు తెలిపారు.

## దివ్యాంగులకు సేవలు నిరంతరము కొనసాగుతాయి



**నంద్యాల, పిబ్రవరి 17,ప్రభాతవార్తప్రతినిధి :** దివ్యాంగులకు వివిధ దాతల చేత చేస్తున్న సేవలు నిరంతరము కొనసాగుతాయని డాక్టరు రవికృష్ణ అన్నారు. మంగళవారము నంద్యాల పట్టణంలో లయన్స్ క్లబ్ అద్వర్యంలో నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం నిర్వహణలో ప్రముఖపారిశ్రామిక వేత్తం ఏయన్‌సి అగ్రోస్‌చైర్మన్ అత్మకూరు సుదరన్నంశెటింట సతీమణి రుక్మిణమ్మ సౌజన్యంతో 20మంది దివ్యాంగులకు రూ16000 విలువ చేసే నెలసరి మందులను ఉచితంగా పంపిణీచేశారు. డాక్టరు రవికృష్ణ మాట్లాడుతూ దివ్యాంగుల సేవలు నిరంవతరము కొనసాగుతాయని నంద్యాల లయన్స్ క్లబ్‌నంద్యాల ఐయంఏ వైద్యులుఎ పట్టణ ప్రముఖుల సహకారముతో గత 24 సంవత్సరాలుగా వేలాది మంది దివ్యాంగులకు సహకారము అందిస్తున్నా మన్నారు. అత్మకూరు సుదర్శంశెట్టి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ సంఘం చేస్తున్న సేవలను ప్రసంశించారు. డాక్టరు సహదేవుడు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ సంఘం దివ్యాంగులకు అవసరమైన మందులను కొనుగోలు చేసిగత 24 సంవత్సరాలుగా ప్రతి నెల పంపిణీ చేయడము అబినందనీయమని అన్నారు.

## కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ-2

– విచారణ చేపట్టి నివేదికను పంపుతాం – ఎంఈఓ-2 శోభారాణి



**కౌతాళం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన కౌతాళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్రమ బియ్యం తరలింపు అనే వార్తా కథనాలు దిన పత్రికల్లో రావడంతో ఎంఈఓ-2 శోభారాణి మంగళవారం విచారణ చేపట్టారు. పాఠశాలకు చేరుకుని బియ్యం నిల్వలు, రికార్డులు తదితర వాటిపై హెచ్ఎం సోముల సుధాకర్‌రెడ్డిని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 శోభారాణి మాట్లాడుతూ తాము పాఠశాలలో రికార్డులను పరిశీలించామని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు

– వ్యర్థాలను తరలిస్తే.... బియ్యం తరలించారని కథనాలురాశారు

– విచారణకు తాను సిద్ధం – హెచ్ఎం సోముల సుధాకర్‌రెడ్డి



పాఠశాలలో గదులకు సున్నం కొట్టించగా మిగిలిచన వ్యర్థాలను బయట పడేసేందుకు బైకుపై తరలిస్తే దానిన్ని బియ్యం అనుకుని... అక్రమంగా బియ్యం తరలిస్తున్నారని కొన్ని దినపత్రికల్లో రాశారని హెచ్ఎం సోముల సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో బియ్యం నిల్వలు, వాటి రికార్డులు అన్ని సక్రమంగా ఉన్నాయన్నారు. కొన్ని దినపత్రికల వారు కావాలనే డబ్బులు ఇవ్వాలని తనను గత కొన్ని రోజుల క్రితం డిమాండ్ చేశారని, తాను ఇవ్వలేనని చెప్పడంతోనే ఇలా తనపై అసత్యపు వార్తలు రాస్తున్నారని ఆరోపించారు. తాను విచారణకు సిద్ధమేనని తెలిపారు. అక్రమంగా బియ్యాన్ని తాను తరలించలేదని చెప్పారు. అసత్యపు వార్తలు రాసిన విలేకరులపై చర్యలు తీసుకోవాలని తాను పోలీసుశాఖ వారిని సంప్రదించి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## మార్చి 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

– సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి పి.జె.సుధ



**ఆదోనిలీగల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త;** మార్చి 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేసి లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి పి.జె.సుధ, 7వ అడిషనల్ జిల్లా జడ్జి వి.లక్ష్మీరాజ్యం, సబ్ జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. మంగళవారం ఆదోని కోర్టులో న్యాయవాదులు లోక్ అదాలత్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ రాజీ కాబడే, పరిష్కార దశలో ఉండే కేసులతో పాటు బ్యాంకులు, రుణాలు, యాక్సిడెంట్ కేసులు తదితర కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఏడీఎం జడ్జి సుభాష్, పీడీఎం జడ్జి అర్చన, బార్ ప్రెసిడెంట్ వి.శ్రీరాములు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**గోనెగండ్ల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలు పట్ల గ్రామీణా ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ భార్గవి,గోనెగండ్ల సీఐ చంద్రబాబు కోరారు. గంజహళ్లి గ్రామంలో ప్రజలతో పోలీసు చట్టాలు, కోర్టు న్యాయం పట్ల అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడారు.వారి సమస్య లను అడిగి తెలుసుకున్నారు.ఈ నెల 22 నుంచి 24వ తేది వరకు జరుగుతున్న ఉరుసు మహోత్సవం గురించి దర్గా నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. దర్గాను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాలలో కొంత మంది ఘర్షణలు లేపేందుకు చూస్తేంటారు వారి మాటలు నమ్మరాదన్నారు.గ్రామాలాలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతూ ఉంటే వాటిని మాదృష్టికి తీసుకురావాలన్ని గ్రామస్థులకు సూచించారు. బాల్యవివాహాలను అరికట్టాలని,మహిళల భద్రత ఎంతో ముఖ్యమని తెలిపారు.అల్లర్లకు పాల్పడేవారి సమాచారం ఇచ్చిన వారి పేర్లు అడ్రస్ గోప్యంగా ఉంచుతామన్నారు.ద్విచక్రవాహనాలలో ప్రయాణించే సమయంలో తప్పక రోడ్డుజాగ్రత్తలను పాటించాలని కోరారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఇటీవల సైబర్ క్రైమ్స్ పెరుగుతున్నాయని వాటి పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని కోరారు. తోలు రాముడు,పూల భాషా,టీడీపీ నాయకులు,గ్రామ పెద్దలు,పోలీసులు పాల్గొన్నారు.

## వైభవంగా ముచ్చట్ల మల్లిఖార్జునస్వామి రథోత్సవం



**బేతంచెర్ల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీముచ్చట్ల మల్లిఖార్జునస్వామి భ్రమరాంభిక సమేత రథోత్సవం మంగళవారం అంగరంగవైభవంగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్వామివారికి వివిధ అర్చనలు, అభిషేకాలు నిర్వహించడం జరిగింది. సాయంకాలం మంగళ వాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య భక్తుల శివనామస్మరణతో రథోత్సవ కార్యక్రమం జరిగింది. బుగ్గాని పల్లె శ్రీబ్రహ్మసూత్ర నాగలింగేశ్వరస్వామి పల్లకీసేవ సిద్దేశ్వరస్వామి పల్లకీ సేవ, భోగేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించడం జరిగింది.

## నేడు ప్రతిష్ట వార్షికోత్సవ ఉత్సవాలు



**చాగలమర్రి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మండలంలోని మూడురాళ్ళ పల్లె గ్రామంలో శ్రీదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి సాయినాథ ఆలయాల ప్రతిష్ట ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలు ఈనెల 18న జరుపుతున్నామని ఆలయ వ్యవస్థాపకులు పులి చిన్నఒబుల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అభిషేకాలు, హోమాలు, వెంకటేశ్వరస్వామి కళ్యాణం, కోలాట నృత్యం, గోవిందనామ పారాయణం జరుగుతుందని తెలిపారు. అలాగే వచ్చిన భక్తులందరికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుండి భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులై ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

## జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రభంజనం



**కర్నూలు విద్య, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ఎన్‌టిఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్-2026 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించి ప్రభంజనం సృష్టించారని ఎస్ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇంచార్జి టి రఘువీర్ తెలిపారు. వివిధ కేటగిరిల్లో జాతీయస్థాయిలో ఇప్పటి వరకు చూసిన ఫలితాల్లో పర్సంటైల్స్ 98.30 నిహల్ ప్రద్యుమ్నసాయి, 97.29తో మణితేజ, 96.12తో ఎస్ పి హరికృష్ణారెడ్డి,95.13తో కె ఆశోక్, 93.40తో వేణు మాధవరెడ్డి, 93.04తో ప్రతాప్,92.27తో గంగ మంజుల విజయానికి కృషిచేసిన ఏజీఎంకు, ప్రిన్సిపాల్‌కు, లెక్చరర్‌లకు, సిబ్బందికి టి రఘువీర్ అభినందించారు. సాధారణ గ్రామీణస్థాయిలో టాప్ ర్యాంకు సాధించిన తల్లిదండ్రులకు, గురువులకు, విద్యాసంస్థలకు పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిన విద్యార్థులను వరదారెడ్డికి, సంతోష్‌రెడ్డికి, డీన్ కిరణ్‌కుమార్‌లకు జోనల్ ఇంచార్జి టి రఘువీర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంపీడివో కార్యాలయంలో సమీక్ష సమావేశం

**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని ఎంపీడివో కార్యాలయంలో మంగళవారం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి శివారెడ్డి మండల పరిధిలో పనిచేస్తున్న పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు, మహిళా పోలీసులు, వేల్ఫేర్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఏకీకృత కుటుంబ సర్వేపై క్షేత్రస్థాయిలో జరుగుతున్న పురోగతిని సమీక్షించారు. కొలిమిగుండ్ల మండలం జిల్లాలోనే అట్టడుగున ఉన్న మండలంలో మూడవస్థానంలో ఉందని ప్రస్తుతం 64 శాతం ఉందని సమిష్టిగా కృషిచేసి పురోగతిని పెంచాలని కోరారు. ఈసందర్భంగా ప్రతి సచివాలయ పురోగతిని సమీక్షించారు. తక్కువ పురోగతి ఉన్న పంచాయితీ కార్యదర్శులను పురోగతి పెంచాలని మందలించారు. తదుపరి మ్యాండెంటరీ, అబుటేడ్, బయోమెట్రిక్, ఈకేవైసి, వాట్సాప్, డోర్ టు డోర్ క్యాంపెయిన్ పంచాయితీ పరిధిలో వసులూ చేస్తున్న ఇంటి పన్నులను సమీక్షించారు. ఇంటిపన్నుల విషయంతో మండలంలో 100 శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. అక్షరాంధ్రకు సంబంధించి అటెండెన్స్ పక్కాగా ఉండాలని వెలుగు ఏపీఎంను అదేశించారు. స్వర్ణగ్రామ ఉద్యోగులు వారి నిర్ణిత సమయపాలన పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడివో దస్తగిరి బాబు, డిప్యూటి ఎంపీడివో చంద్రమౌలీశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఏపీఎం, వెలుగు, సచివాలయ సిబ్బంది, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన బండలాగుడు పోటీలు



**బండిఆత్మకూరు, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని రైతుల కోసం శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సంబరాలు మండల పరిధిలోని శైవ క్షేత్రాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా శైవ క్షేత్రాల్లో జరిగిన బండలాగుడు పోటీలు హోరాహోరిగా జరిగాయి. ఈ పోటీలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుండి రైతులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కృష్ణానంది క్షేత్రంలో బండలాగుడు పోటీలు ఎస్ఐ జగన్‌మోహన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా విజేతలైన వృషభరాజములకు బహుమతులను ప్రధానం చేశారు. శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు సభ్యులు భరద్వాజ శర్మ, తోట శ్రీనివాసులు, వెంకటాపురం శ్రీనివాసులు, రామకృష్ణ, పల్లె సోమశేఖర్‌రెడ్డి, అల్లె ఈశ్వర్‌రెడ్డి, చింతకుంట శ్రీనివాసరెడ్డి, సోమశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## కృష్ణ నంది దేవస్థానంలో ప్రత్యేక పూజలు



**బండిఆత్మకూరు. ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని నవనందుల్లో ఐదవ నంది అయిన కృష్ణనందీశ్వరదేవస్థానాన్ని గత మూడు రోజులుగా రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆదిదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ తిరుపం రెడ్డి, ఆలయ అధికారి రామంజనేయశర్మ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

## దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామివార్లకు ప్రత్యేక పూజలు



**హొళగుంద, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త;** మండలంలోని దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, బిల్వార్చన, బండారు అర్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ కార్యక్రమాలను అర్చకులు మల్లయ్యస్వామి, మహేష్‌స్వామి పూజలు చేపట్టారు. చిన్నారులు మెట్లకు కుంకుమ బండారు అట్టించి భక్తిని చాటుకున్నారు. ఆదోనికి చెందిన రవి అనే భక్తుడు గిరిపైకి మోకాళ్లపై ఎక్కుతో మొక్కు చెల్లించుకున్నాడు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

## బాలనరసింహుడి మృతి తీరని లోటు



**చాగలమర్రి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మండలంలోని డి వనిపెంట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు ఉంద్ర బాలనరసింహుడు (75) మృతి టీడీపీ పార్టీకి, భూమా కుటుంబానికి తీరనిలోటని ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బాలనరసింహుడు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న భూమా విఖ్యాత్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృత దేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుని కుటుంబానికి టీడీపీ, భూమా కుటుంబం ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. సంతాపం తెలిపిన వారిలో మండల కన్వీనర్ నరసింహారెడ్డి, పెద్ద ఈశ్వర్‌రెడ్డి, బాబు నాయుడు, దస్తగిరి బాలయ్య తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ స్కూల్స్‌లో ఉచిత ప్రవేశాలకు ధరఖాస్తు చేసుకోండి



**చాగలమర్రి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్ల ప్రవేశాలకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఏ శేషశయనరెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం కింద 2026-27 విద్యాసంవత్సరానికి 25 శాతం ఉచిత విద్య హక్కు చట్టం 2009 కింద ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాల పిల్లలకు ప్రైవేట్ బడుల్లో 25 శాతం ఒకటవ తరగతిలో ఉచిత విద్య అందించనున్నారన్నారు. ఈనెల 25 నుంచి మార్చి 10వ తేది పాఠశాల అన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆదాయ, కుల, నివాస, రేషన్, జనన, అధార్ వంటి ధృవపత్రాలు సమర్పించాలన్నారు. అన్‌లైన్ లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని ఎంపికైన వారికి ఏ పాఠశాల అనే విషయం చరవాణితో తెలుపుతారన్నారు. మరింత సమాచారం కోసం టోల్ ఫ్రీ నం.1800425899ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



**రుద్రవరం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మండల కేంద్రం రుద్రవరం మేజర్ గ్రామ పంచాయితీ అభివృద్ధికి ప్రజలు తప్పనిసరిగా పన్నులు చెల్లించి పంచాయితీ అభివృద్ధికి ప్రతిఒక్కరు సహకరించాలని ఇంచార్జి ఈవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ముఖ్యంగా 2024-25 ఆర్థికసంవత్సరానికి సంబంధించి ఇంటిపన్నులు,ట్రేడ్ లైసెన్సులు ఫీజులు వ్యాపారులు, ప్రజలు సకాలంలో చెల్లించి సహకరించాలని వారు కోరారు. గత ఐదు నెలలుగా తాను ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి తాగునీరు. పారిశుద్ధ్యం మరియు వీధి ధీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించామని భవిష్యత్తులో ఈసేవలను మరింత పటిష్టం చేస్తామని హామి ఇచ్చారు. ప్రస్తుతం సిబ్బంది కొరత ఉన్నప్పటికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు పన్నుల వసూలు ప్రక్రియ కొనసాగిస్తున్నామని రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో వుంచుకొని తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఏప్రిల్ 20 నుంచి 22 వరకు గ్రామంలో జరగన్న పెద్దమ్మ తల్లి జాతరను పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా లైటింగ్ పారిశుద్ధ్యం మరియు తాగునీటి వసతులను కట్టుదిట్టంగా ఏర్పాటు చేస్తామని ఆయన ఈసందర్భంగా స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి సునీల్‌కుమార్‌రెడ్డి, పంచాయితీ సిబ్బంది పార్థసారధిరెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## నులిపురుగులను నులిమేద్దాం..!



**రుద్రవరం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** చిన్న పిల్లలు మరియు కిశోర బాలల కడుపులో చేరిన నులిపురుగులను నులిమేద్దామని వైద్యాధికారి అమర్నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆలమూరులోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు, కిశోర బాలలు తరుచు కడుపులో నులిపురుగుల వల్ల బాధపడుతుంటారని వీటి నివారణ కోసం ప్రతి 6 నెలల కొకసారి అల్‌బెండాజోల్ 400 మి.లి. గ్రాముల మాత్రలను పిల్లలకు వేయడం జరుగుతుందన్నారు. ఈనులిపురుగుల పిల్లల్లో తీవ్ర రక్తహీనత పోషకాహార లోపాలు ఏర్పడి శారీరక, మానసిక ఎదుగుదల కుంటుపడుతుందన్నారు. అలాగే పెరగిన చేతి గోళ్లను ఎప్పటికప్పుడు కట్‌చేసుకోవాలన్నారు. ఆహారం తీసుకోవడానికి ముందు మరియు మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తరువాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయరాదన్నారు. బయట తిరిగే సమయంలో కాళ్ళకు చెప్పులను ధరించాలన్నారు. కూరగాయాలు, పండ్లను శుభ్రమైన నీటితో కడిగి వాడుకోవాలన్నారు. ఆలమూరు ప్రాదమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో ఉన్న 3235 మంది విద్యార్థులకు గాను 3170 మంది అల్‌బెండోజోల్ మాత్రలు పంపిణి చేశామన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రసూల్, ఆరోగ్యకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## ఫార్మర్ ఐడితోనే ప్రభుత్వ పథకాలు



**కొత్తపల్లె, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ప్రతిరైతుకు ఫార్మర్ ఐడి తప్పనిసరి అని ఫార్మర్ ఐడితోనే ప్రభుత్వ పథకాలు అందుతాయని మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం అధికారులకు సూచించారు. ఆమె మంగళవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్ నందు పంట వేసుకున్న రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్‌లో ఫార్మర్ అప్లికేషన్ యాప్‌ను ప్రతిరైతు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈయాప్ వల్ల రైతులు పంటల యొక్క సస్యరక్షణ ఏవిధంగా నిర్వహించాలి రైతుసేవా కేంద్రం అందిస్తున్న ప్రభుత్వ పథకాల గురించి సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రతిఒక్కరు చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో రైతుసేవా సిబ్బంది గోవర్ధన్, రైతులు పాల్గొన్నారు.

## సర్వేలు త్వరగా పూర్తిచేయాలి



**కొత్తపల్లె, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మండలంలో జరుగుతున్న ఏకీకృత కుటుంబ సర్వే త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో మేరి, గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆమె మంగళవారం మండల కేంద్రమైన కొత్తపల్లె సచివాలయ పరిధిలో జరుగుతున్న ఏకీకృత సర్వేను తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏకీకృత కుటుంబ సర్వే ప్రతి కుటుంబానికి సకాలంలో సేవలు అందించడానికి ఈసర్వే ఉపయోగపడుతుందన్నారు. సచివాలయ సిబ్బంది సర్వే వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలన్నారు. అనంతరం కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేశారు. ఈతనిఖీల్లో పలు రికార్డులు నిల్వ ఉన్న పౌష్టికాహారం తనిఖీచేశారు. అనంతరం చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. పిల్లల్లో నులిపురుగులతో శారీరక, మానసిక ఎదుగుదల మందగిస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవాలన్నారు. చేతులు శుభ్రం చేసుకునేవిధానాన్ని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఆదిదేవుని దంపతుల రథోత్సవం



**బండిఆత్మకూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఓంకారక్షేత్రంలో శ్రీగంగ ఉమా సమేత సిద్దేశ్వరస్వామివార్ల రథోత్సవం అంగరంగ వైభవంగా ఆలయ చైర్మన్ చెనాన్నరెడ్డి, ఆలయ అధికారి నాగప్రసాద్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆదిదేవుని దంపతులు ఓంకార క్షేత్రంలోని పురవీదులు గుండా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈసందర్భంగా అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు, భక్తులు ఓం.నమశివాయ అంటూ రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రథోత్సవకార్యక్రమంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ జగన్‌మోహన్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమం జరిగినంతసేపు నల్లమల అడవుల్లోని ఓంకార క్షేత్రంలో ఓం.నమశివాయ అంటూ ఓంకార నాదంతో మారుమోగిపోయింది. రథోత్సవ కార్యక్రమం సందర్భంగా జిల్లాలోని నలు మూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆదిదేవుని దంపతులను దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అల్లె ఈశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా దుర్గా భోగేశ్వరుడి రథోత్సవం

**: రథోత్సవంలో వేలాది సంఖ్యలో తరలివచ్చిన భక్తులు**



**గడివేముల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నాడు శ్రీ దుర్గా భోగేశ్వర ఆలయ ఆవరణలో దుర్గా సమేత భోగేశ్వరస్వామివారి రథోత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాలతో భక్తజన భక్తి పారవశ్యం నడుమ వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించిన రథంపై నవదంపతులైన శ్రీదుర్గామల్లేశ్వరి, అయ్యవారి ఉత్సవమూర్తులను రథంపైకి చేర్చారు. ప్రధాన అర్చకులు శ్యాంసుందరశర్మ, గిరిధర్‌శర్మలు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథం లాగడానికి యువకులు, భక్తులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. రథంపై ఉన్న స్వామి, అమ్మవార్లను వేలాది మంది భక్తులు దర్శించుకుని తరలించారు. రథోత్సవం సందర్భంగా శ్రీ దుర్గా భోగేశ్వరం భక్త జనులతో కిక్కిరిసిపోయింది. అర్చకుల వేద మంత్రాలతో మంగళవాయిద్యాలతో భక్తుల కోలాటం భజనలతో అశేష భక్త జనుల శివనామ స్మరణలతో రథయాత్ర కొనసాగింది. రథయాత్ర ఊరేగింపు సమయంలో స్వామివారిని దగ్గర నుంచిచూడాలని భక్తులు ముందుకు రావడానికి ప్రయత్నించారు. స్వామివారి రథం లాగితే పుణ్యం దక్కుతుందన్న నమ్మకంతో పెద్ద ఎత్తున భక్తులు రథం లాగడానికి పోటీ పడ్డారు. పురవీధుల్లో స్వామివారు రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తును పాణ్యం సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి, గడివేముల ఎస్ఐ నాగార్జునరెడ్డి, పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది నిర్వహించారు. సాత్వికబలి, మహాన్యాస పూజ, రుద్రాభిషేకం, పూర్ణాహుతి, నందికోలసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్యాంసుందర్‌శర్మ తెలిపారు. మంగళవారంతో దాదాపు బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు ముగిసినట్లు తెలిపారు. ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ కంది శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్యాంసుందరశర్మ, గిరిధర్‌శర్మ, విజయ్‌కుమార్‌శర్మ, ఆలయ ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది రమణ, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట..

**- కూటమి ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది**



**దేవనకొండ, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారని, కూటమి ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని దేవనకొండ టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలు మెచ్చిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఆర్థిక మంత్రి సమర్పించిన ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ దిశగా ఒక సమగ్ర ప్రణాళికగా నిలిచిందన్నారు. రూ.3,32,205 కోట్ల భారీ బడ్జెట్‌తో అన్ని వర్గాల సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వం పోలిస్తే ఆర్థిక క్రమశిక్షన పాఇస్తూ లోటును 9 శాతానికి తగ్గించడం ప్రశంసనీయమన్నారు. యువతకు ఉపాధి అవకాశల కల్పనలో భాగంగా 30,607 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు ప్రకటించడం సంతోషకరమైన విషయమన్నారు.

## శ్రీశ్రీశ్రీ కాశీచంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం



**నందికొట్కూరు,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** కొలిచేవారి కొర్కెలు తీర్చేదేవుడుగా ప్రసిద్ధి గాంచిన బిజినవేముల గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ కాశీ చంద్రమౌళీశ్వర స్వామి తిరునాల సందర్భంగా రథోత్సవం కన్నుల పండుగల జరిగింది. గత మూడు రోజులుగా గ్రామ సర్పంచ్ రవియాదవ్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో స్వామివారికి కళ్యాణ మహోత్సవం, ప్రభోత్సవం, విశేష పూజలు నిర్వహించారు., మంగళవారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు అత్యంత వైభవంగా అలంకరించిన రథంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి భక్తజనులు కాగా అశేష భక్తజనులు ఓం నమఃశ్శివాయ అను పంచాక్షరి నామంతో హోరెత్తుతుండగా స్వామివారి రథం గ్రామ పురవీధుల గుండా తిరుగుతుండగా భక్తులు తిలకించి ఆనందోత్సాహంతో రథాన్ని లాగుటకు ముందుకు కదిలారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవియాదవ్, గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భంధోబస్తు నిర్వహించారు.

## 20న శ్రీశ్రీశ్రీ మారెమ్మ సహిత సుంకుల పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

**నందికొట్కూరు,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో ఈ నెల 20న శ్రీశ్రీశ్రీ మారెమ్మ సహిత సుంకులపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించబడుతుందని గ్రామ పెద్దలు పాలా నాగిరెడ్డి తెలిపారు. 18వ తేదీన సాయంకాల ప్రదోష పూజలు, మండప అవహాన పూజలు, వాస్తు, నవగ్రహ యోగిని మండప దేవత ఆహ్వానము, అగ్ని ప్రతిష్టాపనము, తీర్థ ప్రసాదాలు, వేద అతీర్వచనము(సాయంకాలం జలాధి వాసము),19న మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామంలో దేవతా విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున భక్తులు ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసి అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని గ్రామ పెద్దలు తెలిపారు.

## ఆటో భోల్తా 15 మందికి గాయాలు

**పత్తికొండ,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** పత్తికొండ మండలం గుండుతాండ గ్రామం నుంచి మెలగవల్లి కొట్టాల గ్రామానికి కూలీ పని కోసం ఆటోలో వెళుతుండగా ఆటో అదుపుతప్పి భోల్తా పడడంతో అందులో ఉన్న 15 మంది కూలీలు తీవ్ర గాయాల పాలయ్యారు. అందులో నలుగురి పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే గిరిజన సంక్షేమశాఖ అధికారి వెంకటపతి, పత్తికొండ ఆర్‌ఓ భరత్ నాయక్ ఆస్పత్రి వద్దకు చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి భాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు.



**ప్రమాదంపై స్పందించిన ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్:** కూలీలు పనుల కోసం వెళుతుండగా ఆటో భోల్తా 15 మందికి గాయాలు అయ్యాయన్న విషయం తెలిసిన వెంటనే పత్తికొండ నియోజకవర్గ శాసనసభ్యులు కేఈ శ్యామ్‌కుమార్ క్షతగాత్రులకు ఫోన్ లో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ తో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఎవరు కూడా ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం గాయపడ్డవారి కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## నాణ్యత లోపం లేకుండా పనులు పూర్తి చేయాలి



**పత్తికొండ,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** పట్టణంలో నిర్మిస్తున్న డివిజన్ అభివృద్ధి కార్యాలయం పనులలో నాణ్యత తగ్గకుండా పూర్తి చేయాలని క్వాలిటి కంట్రోలు డిఈ ధనుబాబు తెలిపారు. మంగళవారం దాదాపు రూ.4 లక్షలు పైగా నిధులతో నిర్మిస్తున్న భవనం నాణ్యత కలిగి ఉండాలని డీఈ సూచిస్తూ భవన నిర్మాణ కొలతలు తీసుకున్నారు, ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోలు సిబ్బంది మాధవరావు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



**తుగ్గలి,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** నులిపురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని ఆయుర్వేధిక్ డాక్టర్.అమర్నాథ్, డాక్టర్.కిరణ్, వైద్యాధికారి రోజారమణి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలోని తుగ్గలి హైస్కూల్‌లోని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అగస్టిన్ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఆయుర్వేదిక్ డాక్టర్.అమర్నాథ్ మాట్లాడుతు విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగ ఉండేందుకు వ్యక్తిగత శుభ్రతను తప్పని సరిగా పాటించాలని తెలిపారు. 19 ఏళ్ళ లోపు చిన్నరులు అల్బెండజోల్ మాత్రలు తపపని సరిగా చేసుకోవాలన్నారు. ప్రభుత్వం వీటిని ఉచితంగా పంపిణి చేస్తున్నదని తెలిపారు. ఏవైన కారణాల చేత నులిపురుగుల మాత్రలు తీసుకోని విద్యార్థులకు ఈ నెల 24న జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికంగా మెలగాలి



**ఆస్పరి,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆధ్యాత్మికంగా మెలగాలని కామవరం శివరాం అవధూత ఆశ్రమం గురువు అపక్తానంద సరస్వతి స్వామి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బిణిగేరి గ్రామ కొండల్లో శ్రీగిరి క్షేత్రంలో వెలసిన శ్రీపంచలింగేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు శ్రీనివాసనాయన రమాదేవి ఆధ్వర్యంలో అధ్యాత్మిక సమ్మేళాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగి ఉండి మంచి మార్గంలో నడవాలన్నారు.ముఖ్యంగా తల్లిదండ్రులను గురువులను పెద్దలను గౌరవించాలన్నారు. అనంతరం గురువులకు శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సన్మనించి మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురువులు హానుమంత స్వామీజీ, జగదీష్ స్వామి, గంగధర్‌రెడ్డి, సోమప్ప, కుమారస్వామిజీ, ఈరన్నస్వామి, మణికొండస్వామి పాల్గొన్నారు.

## శ్రీగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

**ఆస్పరి,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** మహాశివరాత్రి పురష్కారించుకొని మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో భాగంగా శ్రీగిరి క్షేత్రంలో మంగళవారం ఉదయం 5 గంటలకు శ్రీపంచలింగేశ్వర స్వామికి అభిషేకం, శ్రీమహాగణపతి, లలితాహోమం, తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం శ్రీపంచలింగేశ్వరస్వామి గిరి ప్రదక్షణ నంది, పల్లకి ఉత్సవం, నందికోలు సేవను భక్తుల మధ్య వైభంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాసనాయన, రమాదేవి దంపతులను స్వామి వారి ఉత్సవమూర్తులను ఓంనమశ్శివాయ అంటూ గంధోత్సవం చల్లుకుంటు మేళతాళాలతో భాజ భజంత్రీలతో గిరి ప్రదక్షణ నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శ్రీ కరెన్న మాధవయ్య హార్మోనిస్టు చనుగొండ్ల వారి ఆధ్వర్యంలో పంచమాంకములు నాటక ప్రదర్శన నిర్వహించారు.సర్పంచ్ వెంకటేష్, వీరేష్, సుధా, నాగరాజు, తిక్కయ్య, తలారి సూరి, మూకన్న, దాసు, రంగన్న, రవిచంద్ర, రవీంద్రబాబు, నరసింహారావు, బాస్కర్‌రెడ్డి, ధర్మరాజు, మూర్తి, శేఖర్, లక్ష్మన్న పాల్గొన్నారు,.

## మందకృష్ణ ను మర్యాద పూర్వకంగా కలిసిన కౌన్సిలర్



**నందికొట్కూరు,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాకులు మందకృష్ణ మాదిగ కర్నూలు జిల్లాలో జరుగుతున్న డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహా ప్రతిష్ట కార్యక్రమానికి హాజరయ్యేందుకు రావడంతో ఆయన నందికొట్కూరు పట్టణ 1వ వార్డు కౌన్సిలర్ చిన్నరాజు కర్నూలులో మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సీవర్గీకరణలో విజయం సాధించడంపై ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనను కౌన్సిలర్ శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సత్కారించారు.

## ఉత్సాహంగా నంది బాలోత్సవాలు ప్రారంభం



**నంద్యాల హాస్పటల్,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాలు నందు నంది బాలోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుండి ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్యాసంస్థల నుండి విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.తొలి రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యాశాఖ అధికారి పి.జనార్ధనరెడ్డి, ఆహ్మాన సంఘం గౌరవాధ్యక్షులు డా.రాజేష్‌రెడ్డి, అధ్యక్షులు డా.డి.క్రాంతి చైతన్య తదితరులతో కలిసి జాతీయ పథాకాన్ని ఆవిష్కరించారు. డిఈవో మాట్లాడుతు పాఠశాలలో పాఠాలు మాత్రమే కాకుండా ఆటలు పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. బాలోత్సవాలు విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్యాలను అభివృద్ధి చేసే మంచి వేదికగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు. డాక్టర్. రాకేష్‌రెడ్డి మాట్లాడుతు ఇటువంటి కార్యక్రమాలు పిల్లల మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని తెలిపారు. అధ్యక్షులు క్రాంతి చైతన్య మాట్లాడుతు విద్యార్థులు సమాజం పట్ల చైతన్యం కలిగి మూడ నమ్మకాల నుంచి దూరంగ ఉండాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 కేంద్రాల్లో బాలోత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వహాకులు తెలిపారు. మొదటి రోజు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, కథారచన, కవితా రచన, ఉత్తర రచన, సైన్స్ ప్రదర్శన, ఏకపాత్రాభినయం, లఘునాటకాలు, ఫ్యాన్సీ డ్రస్సు, క్లాసికల్ నృత్యం తదితర పోటీలు నిర్వహించారు.

## చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



**ఆత్మకూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** పట్టణంలోనీ ప్రభుత్వ హై స్కూల్ నందు వైద్య సిబ్బంది జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పట్టణం మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ ఔకు. ఓబులేసు ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందన్నారు. భోజనం చేసిన అరగంట తర్వాత మాత్రలు తీసుకోవాలని చిన్నారులకు తెలిపారు. ఈ టాబ్లెట్ వేసుకోవడం వలన పిల్లలలో పోషక ఆహార లోపం రక్తహీనత నివారిస్తుందన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని పట్టణ మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ ఔకు.ఓబులేసు తెలియజేశారు. ఏవైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన వారికి ఈ నెల 24వ తేదీన మరల ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వడం జరుగుతుందన్నారు. కళాశాల ప్రధానోపాధ్యాయుడు దేవానంద్, వైద్య సిబ్బంది ఏఎన్ఎం సుబ్బలక్ష్మి, మల్లేశ్వరి, ఆశ కార్యకర్తలు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## నిలిచిపోయిన సచివాలయం పనులను ప్రారంభించాలి

**: 16.78 లక్షల నిధుల పై విచారణ చేయించాలి**



**పెద్దకడబూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పెద్దకడబూరు లో స్థానిక ఎస్సీ కాలనీ నందు గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన సచివాలయం నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి సచివాలయాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అలాగే ఇప్పటివరకు 16.78 లక్షలు డ్రా చేశారని ఈ నిధులను ఏ ఏ పనులకు వినియోగించారో ప్రజలకు తెలియజేయాలని ఎస్సీ కాలనీవాసులు మంగళవారం ఎంపీడీవో ప్రభావతి ని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీ పెద్దలు బొగ్గుల దావీదు, జానయ్య , జగతప్ప కుమార్ జయరాజు ముక్కరన్న గుమ్మల ఆశన్న ఇస్సాక్ మంచోది బజ్జప్ప రాజు భాష రోగోడు సుధాకర్ లు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సచియ సచివాలయ భవనాలు పూర్తి చేశారని మండల కేంద్రమైన పెద్దకడుబూరులో ఎస్సీకాలనీలో సచివాలయ నిర్మాణ పనులు మధ్యలోనే ఎందుకు ఆపివేశారని ప్రశ్నించారు సచివాలయ భవనాన్ని బేస్ మట్టం వరకు చేసి పిల్లర్లు వేసి వదిలేయడం దారుణమన్నారు ఇటీవల పెద్దకడబూరుకు వచ్చిన జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు ఇప్పటికైనా పెండింగ్లో ఉన్న సచివాలయ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు ఎంపీడీవో కు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## వీఆర్వోలకు పని భారం తగ్గించండి :వీఆర్వో మల్లారెడ్డి



**డోన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం విలేజ్ రెవెన్యూ అధికారులకు పని భారం తగ్గించాలని విలేజ్ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు మల్లారెడ్డి డిమాండ్ చేశారు మంగళవారం డోన్ తాసిల్దార్ కార్యాలయం ముందర సహచర మిత్రుడు ఎం పెండేకల్ విలేజ్ రెవెన్యూ అధికారి వెంకట్ రాముడు మృతి చెందడం బాదకరమని పేర్కొన్నారు ఆయన మృతికి రెండు నిమిషాలు మౌనవ్రతం పాటించి, ఆయన మాట్లాడుతూ క కూటమి ప్రభుత్వం విలేజ్ రెవెన్యూ అధికారులపై పనిభారం పెంచడం వల్లే బేతంచెర్ల మండలం ఎం పెండేకల్ విలేజ్ రెవెన్యూ అధికారి వెంకట రాముడు మృతి చెందారని వాపోయారు వెంకట రాముడు డ్రాఫ్ట్ పాస్ బుక్ లు ఈ కేవైసీ చేయించడానికి పెండేకల్లుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందడం బాధాకరమైన విషయం అన్నారు ఈ కార్యక్రమంలో బేతంచెర్ల డిప్యూటీ తాసిల్దార్ మారుతి డోన్ సీనియర్ అసిస్టెంట్ ఉపేంద్ర జూనియర్ అసిస్టెంట్ హరీష్ విఆర్వోలు కృష్ణారెడ్డి గోవిందు భాస్కర్ నాయుడు మోహన్ రావు వెంకట్రాముడు మధు మహేష్‌లు పాల్గొన్నారు.

## డా. వై. కామేశ్వర ప్రసాద్‌ను కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా నియామకం

**కర్నూలు, హాస్పిటల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం, ఏపీ ఎస్ఎసిఎస్ తాడేపల్లి లో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా విదేశీ సేవల కింద పనిచేస్తున్న డా. వై. కామేశ్వర ప్రసాద్, సిఎస్ఎస్ ను వారి మూల శాఖకు తిరిగి పంపిస్తూ, కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా ఒక సంవత్సర కాలానికి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన జీవో ఆర్తి నంబరు.166 (తేది: 1702 2026) ప్రకారం ఈ నియామకం జరిగింది. సంబంధిత ఉత్తర్వుల మేరకు ఏపీ ఎస్ ఎ సి ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా. కామేశ్వర ప్రసాద్‌ను తక్షణమే రిలీవ్ చేయాలని ఆదేశించారు. ఈ వ్యవహారంపై ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్‌తో పాటు ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ సంచాలకులు అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**మంత్రాలయం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త;** రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు పీడీ (ఫిజికల్ డైరెక్టర్) రవీంద్ర మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కర్నూలులో ఈ పోటీలు జరిగాయన్నారు. పదో తరగతి చదువుతున్న చిన్ననాగయ్య 150 కేజీల లిఫ్టింగ్‌లో మూడు బంగారు పతకాలు, 9వ తరగతి నరసింహా 170 కేజీల లిఫ్టింగ్‌లో బంగారు పతకం, పదో తరగతి చదువుతున్న వినయ్ 200 కేజీల లిఫ్టింగ్‌లో రజత పతకం, 9వ తరగతి వెంకటేష్ 185 కేజీల లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానం చేశారు.

## ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

**- రూ.50 వేలు ఆస్తి నష్టం - ఆదుకోవాలంటున్న రైతు**



**మంత్రాలయం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త;** మంత్రాలయం మండలం మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరమాన్‌దొడ్డి తాండ గ్రామంలో ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమయ్యింది. రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. వివరాల మేరకు... గ్రామానికి చెందిన రామస్వామి నాయక్ అనే రైతు తమ పశువులకు పశుగ్రాసం నిమిత్తం సుమారు రూ.50 వేలు విలువ చేసే గడ్డిని కొనుగోలు చేసి నిల్వ ఉంచాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు. ప్రమాదవశాత్తు గడ్డి మొత్తం కాలి బూడిదయ్యింది. సమాచారం తెలుసుకునే లోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పశుగ్రాసం దగ్ధమైన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

## కళాశాల పేరు నిలుబెట్టేది మంచి ఉత్తీర్ణత శాతమే..



**కోసిగి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** బాగా చదువుకుని పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత కోర్సుల దిశగా అడుగులు వేయాలని, ముఖ్యంగా కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి అన్నారు..మంగళవారం కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోల్ సభను కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వీడ్కోల్ సభలో జ్యోతి ప్రజ్వాలన చేసారు.. విద్యార్థుల గురించి కళాశాలలోని సౌకర్యాల గురించి కళాశాల ప్రిన్సిపల్ తెలియజేసారు.. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవిమాట్లాడుతూ కోసిగిలాంటి ప్రాంతంలో వలసలు ఎక్కువగా ఉన్నాయని దీంతో చదువులు మధ్యలో ఆపేసి తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు కూడా వలసలు పోతున్నారన్నారు.. విద్యార్థులు మధ్యలోనే చదువును ఆపకుండా ఉన్నత విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులు కూడా వారిని ప్రోత్సాహించాలని సూచించారు. మంచి మార్కులతో పాసై కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.. కళాశాల అధ్యాపకులు సునీల్, ఈరన్న, సాంబశివుడు, గోవిందు, వెంకటేశ్, రాణాప్రతాప్, అనంతమ్మ, జ్యోతి, ప్రకాష్, కీర్తి, నవీన్, నాగేంద్ర, కొండయ్య, వెంకటేశ్, పాల్గొన్నారు..

## రథోత్సవ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



**హాలహర్వి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త;** మండలంలోని గూళ్యం గ్రామంలో సిద్ధలింగేశ్వర, గాదిలింగేశ్వరస్వాముల ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని హాలహర్వి ఎస్ఐ ఈశ్వరరావు అన్నారు. ఈనెల 22న గూళ్యం గ్రామంలో జరిగే జోడు రథోత్సవాలను దృష్టిలో ఉంచుకుని మంగళవారం ఆయన గూళ్యం గ్రామంలో పర్యటించారు. ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ అధికారులకు సూచించారు. తాగునీరు, అత్యవసర వైద్యం తదితర మౌలిక వసతులను కల్పిస్తామని తెలిపారు. కుల మతాలకు అతీతంగా భక్తులు రథోత్సవ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఉత్సవాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జేఈఈ మెయిన్‌లో నారాయణ విద్యార్థుల విజయకేతనం



**ఆదోనిలీగల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త;** జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఆదోని నారాయణ విద్యార్థులు ప్రతిభ చాటారు. గత నెలలో జరిగిన జేఈఈ మెయిన్ పరీక్షా ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఆదోని నారాయణ విద్యార్థులు అత్యధిక పర్సంటైల్‌ను సాధించి ప్రతిభ చాటారు. ఈ ఫలితాల్లో చైతన్య రాఘవ 96.70 పర్సంటైల్, జి.చంద్రకళ 95.94, కె.అక్షిత్ 93.08, ఎస్.విశాల్ సాయి 91.63, రూప పాటిల్ 90 పర్సంటైల్, 85 పర్సంటైల్ ఆపైగా 8 మంది, 80 పర్సంటైల్ పైగా 15 మంది సాధించి సత్తా చాటారన్నారు. ఈ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు కర్నూలు నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ పి.లింగేశ్వరరెడ్డి ఫ్లవర్ బొకే అందించి స్వీట్లు తినిపించి అభినందించారు. అలాగే జేఈఈ మెయిన్ ఫేజ్-2లో ఇంకా మంచి పర్సంటైల్ సాధించి ఉన్నత స్థాయికి వెళ్లాలని మెలుకువలు చెప్పారు. ఇంతటి ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు వారికి సపోర్టు చేసిన తల్లిదండ్రులు,అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ కె.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించండి



**హొళగుంద, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త;** సకాలంలో ఇంటి, కుళాయి తదితర పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని గ్రామ పంచాయతీ సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం వారు స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి, గ్రామస్తులు, ప్రతిఒక్కరూ సహకరించాలని వారు కోరారు. డ్రైనేజీ, క్లీనింగ్, పైపులైన్ లీకేజీ, వీధిలైట్లు, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, పారిశుద్ధ్య పనులతో పాటు తదితర పనులపై ఏమైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. గ్రామస్తులు పన్నులు చెల్లించాలంటే పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పన్నులు చెల్లించి రశీదులు పొందాలన్నారు.

## నులిపురుగుల మందులను ప్రతి విద్యార్థి వేసుకోవాలి



**గోనెగండ్ల,ఫిబ్రవరి,17, ప్రభాతవార్త :** నులిపురుగుల నివారణతోనే పిల్లల ఆరోగ్యం బాగుంటుంది.కావున ప్రతి విద్యార్థి నులిపురుగుల మందులను తప్పక వాడాలని వైద్యురాలు రంగ రవళి కోరారు.మంగళవారం మండలం లోని పలు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులందరికి ఆల్‌బెండాజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. గోనెగండ్లలోని ఉన్నతపాఠశాలలోని విద్యార్థులకు మా త్రలను వైద్యురాలు రంగారవళి, ఎంఈవో నీలకంఠ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ 1ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్నవారు అందరు ఈ మాత్రలు మింగాలన్నారు. రక్తహీనత, పోషకాహారలోపం, అకలి లేకపోవుట, బలహీనత మరియూ ఆందోళన, కడుపునొప్పి వికారం, వాంతులు, అతిసార, మలంలో రక్తం చర్మదద్దులు వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు.స్థానిక ప్రభుత్వం ఆసుపత్రిలో ఉచితంగా మాత్రలను అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 11,129 పిల్లలకు గాను 10596 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి గోళ్లను చిన్నవిగా శుభ్రంగా ఉంచు కోవాలని, ఎప్పుడు శుభ్రమైన నీటినే తాగాలన్నారు. బయట తిరిగే సమయంలో పాదాలకు బూట్లు, చెప్పులు వేసుకోవాలని, బహిరంగ ప్రదేశాలలో మల విసర్జన చేయరాదని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగభూషణం, ఎంపీహెచ్‌వో హనుమంతు, సీహెచ్‌వో మేరిగోల్డ్, భారతి విజయలక్ష్మి, పరమేశ్వరప్ప, సిబ్బంది పాల్గొన్నారు.


**ANDHRA PRADESH STATE WAQF BOARD**
4th Floor, Imdad Ghar, Opp. Head Post Office, Kaleswararao Market, Vijayawada-1

F.No.08/KNL/M/2019 **NOTIFICATION** Date: 12-02-2026

The Waqf institution namely Shah Sab Mosque known as Shah Shah Masjid situated at B-dwarpet, Kurnool City and District is a notified Waqf and got published in AP Gazette No. 43-A, Part-II, Dated 24-10-1963 at Serial No. 3149 in page Nos. 34 & 35 and the institution is having attached property in TD No. 3655 in Sy No. 622 to an extent of Ac.1.32 cts, Sy No. 623/A to an extent of Ac.1.35 cts, Sy No 723 to an extent of ac.6.10 cts and Sy No. 720 to an extent of ac.0.40 cts situated at Kallur (V&M), Kurnool District under the Towliath of (1) Syed Alam and (2) Syed Abdul Rasool and the Rule of succession to the office of the Mutawalli specified as hereditary.

A representation was received from Sri Syed Azam S/o late Syed Ali Miah with a request to recognize him as Mutawalli to the subject institution in place of his demised mother Smt Shahzadi Bi W/o. Syed Ali Miah who is one of the Mutawalli of the subject institution.

Therefore, any person having claims / objections if any, may file before this office along with documentary evidence in respect of recognition of Sri Syed Azam S/o late Syed Ali Miah R/o. Kurnool City as Mutawalli of the subject institution and its attached properties U/sec.42 of the UWMEED Act, 1995 as amended by the Waqf (Amendment) Act, 2025 in place of his demised mother Smt Shahzadi Bi W/o. Syed Ali Miah, Mutawalli of the subject institution within a period of (15) days from the date of publication of this notification, otherwise the matter will be decided on merits on the basis of the documents available on record.

**- Chief Executive Officer**



**YEMMIGANUR MUNCIPALITY**
E-Procurement Tender Notice No.16/General Fund - 2026-2026/E1. Dt.17-02-2026

మునిసిపల్ సాధారణ నిధులతో 1 పనికి గాను రూ. 3.88 లక్షలతో అర్హులైన కాంట్రాక్టర్ల నుండి టెండర్లు స్వీకరించబడును,వివరములకు apeprocurement.gov.in నుండి పొందగలరు.

- **కమీషనరు**, ఎమ్మిగనూరు పురపాలక సంఘం.

# భక్తజనసందోహం మధ్య యాగంటిలో నేత్రపర్వంగా రథోత్సవం

**: ఉత్సవంలో పాల్గొన్న ఆర్ అండ్ బి మంత్రి సతీమణి బీసీ ఇందిరారెడ్డి**

**బనగానపల్లె ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బనగానపల్లె మండలంలోని యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో 4 వ రోజు మంగళవారం సాయంత్రం రథోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పూజాదికార్యక్రమాల్లో పాల్గొని తేరును లాగారు.ఆలయ ఈవో,సహాయ కమిషనర్ పాండు రంగారెడ్డి,చైర్మన్ బండి మోళీశ్వరరెడ్డి, ప్రత్యేకాధికారి సుధాకరరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ రథోత్సవం కార్యక్రమంలో ఉత్సవ మూర్తులకు ముందుగా దేవాలయ ప్రాంగణంలో విశేష పూజలు, అర్చనలు చేసి భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ పల్లకిలో తోడ్కొని పెద్ద కోనేరు వద్ద ఉన్న రథం వద్దకు చేర్చారు. రథంపై విగ్రహాలను అధిష్టింపజేసి సాత్విక బలిగా కొబ్బరి, గుమ్మడి కాయలను సమర్పించారు. అనంతరం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తుల ఓంకార ధ్వనుల మధ్య రథాన్ని ముందుకు లాగారు.ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ దోనపాటి యాగంటి రెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి, మాజీ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి మల్కిరెడ్డి దస్తగిరి రెడ్డి, ట్రెజరర్ రామారెడ్డి, బత్తుల నారాయణరెడ్డి శంకేశ్వర రెడ్డి ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ, కిషోర్ శర్మ, లోకనాథ్ శర్మ, సత్యనారాయణ శర్మ, ,రాఘవేంద్ర శర్మ,బనగానపల్లె సిఐ ప్రవీణ్ కుమార్ ,ఎస్సై లు దుగ్గిరెడ్డి, కల్పన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు . ఈ రథోత్సవం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# వైసిపి.. బిజెపి నేతలకు.. పదవులు..!?

**: సోషల్ మీడియాలో తెలుగు తమ్ముళ్లు గరంగరం..**
**: అన్న క్యాంటీన్ చైర్మన్ పదవులు తాత్కాలికంగా నిలిపివేత..**





**ఆదోని క్రైమ్17 ఫిబ్రవరి ప్రభాతవార్త :**
ఆదోని లో కూటమి మూడు పార్టీలు ఉంటాయి అనుకుంటే పొరపాటు ఇక్కడ ఆదోనిలో బిజెపి హవా అన్నట్టు ఎమ్మెల్యే పార్థసారథి వ్యవహరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు భూపాల్ చౌదరి అందరికీ కంగ్రాట్స్ అంటూ కూటమి ప్రభుత్వంలో వైసిపి నుంచి వచ్చిన కౌన్సిలర్లకు పదవులు ఒకే ,తెలుగుదేశం పార్టీకి చెందిన ఒకే ఒక్క కౌన్సిలర్ ఎమ్మెల్యేకు గుర్తుకు రాకపోవడం బాధాకరం. రాబోయే కౌన్సిల్ ఎలక్షన్లలో కూడా 42 వార్డులలో బిజెపి వాళ్లను నిలబెట్టాలని నిండు మనసుతో కోరుకుంటున్నాను ఎమ్మెల్యేగా గెలిచే వరకు ఒక లెక్కన ఆల్ ది బెస్ట్ బిజెపి లీడర్స్ అని భూపాల్ చౌదరి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడానికి క్రియాశీలకంగా తెలుగు తమ్ముళ్లు కష్టపడి బిజెపి అభ్యర్థి పార్థసారధిని అహర్నిశలు కష్టపడి గెలిపించుకున్నామని ఇప్పుడు పదవులు మాత్రం వైసీపీ పార్టీ నుంచి వచ్చిన కౌన్సిలర్లకు కట్టబెడుతుండడంతో సోషల్ మీడియాలో బహిరంగంగానే విమర్శలు కురిపిస్తున్నారు ఏది ఏమైనాప్పటికీ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి వ్యవహరిస్తున్నారని తీరు కూటమిలో వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. తెలుగుదేశం కార్యకర్తలు కానీ నాయకులకు కానీ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పట్టించుకోవడంలేదని మేము కష్టపడి గెలిపిస్తే ఇప్పుడు పదవి అనుభవించడం కాదు కార్యకర్తలను నాయకులను గుర్తించుకొని దానికి తగ్గట్టు పదవులు కట్టబెడితే బాగుంటుందని వైసిపి నుండి వచ్చిన వారికి కట్టబెట్టడం ఎంతవరకు సమంజసం అని తెలుగు తమ్ముడు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కూటమి అంటే మూడు పార్టీలు కలయిక తో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని దీన్ని గుర్తుపెట్టుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అలాంటిది వైసిపి నుండి బిజెపి లోకి వచ్చిన వారికి పదవులు ఇవ్వడం కరెక్ట్ కాదు అని ఆదోనిలో తెలుగుదేశం కార్యకర్తలు పూర్తిస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారం టిడిపిది అయినప్పటికీ ఇక్కడున్నటువంటి ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, వై బిజెపి పార్టీకి పదవులు ఇవ్వడంతో సర్వతుల విమర్శలు రావడంతో తాత్కాలికంగా నియామకం ని రద్దు చేస్తూ ఆదోని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ఉత్తర్వులు జారీ చేశారు .

## కోడుమూరులో మందక్రిష్ణకు ఘన స్వాగతం



**కోడుమూరు,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :**
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు,పద్మశ్రీ మందక్రిష్ణకు కోడుమూరు ఎమ్మార్పీఎస్,బుడగజంగాల సంఘాల సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామంలో ఇటీవల హత్యకు గురికాబడిన మాదిగ రమేష్ కుటుంబాన్ని పరామర్శించేందకు మంగళవారం ఎమ్మార్పీఎస్ నేత మందక్రిష్ణ మాదిగ కోడుమూరు మీదుగా తుగ్గలి మండలంకు వెళ్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మార్పీఎస్,బుడగజంగాల సంఘాల ప్రతినిధులు స్థానిక కోట్ల సర్కిల్ దగ్గర మందక్రిష్ణకు బాణ సంచాలు పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పూలమాలలు వేశారు. ఆయనను కలిసిన వారిలో కోడుమూరు తాలుకా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య, నాగేష్, సప్పోగు రాజు,ఆమోసు, మహేష్ మాదులు ,ప్రసంగి, ప్యాలకుర్తి రాజు,కపట్రాళ్ల లక్ష్మన్న,క్రిష్ణాపురం లాలు,పులకుర్తి ఇమ్మానియల్, గోరంట్ల నాగరాజు ఆయా గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రథోత్సవం

**డోన్ ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**



డోన్ పట్టణంలోని కొత్త బుగ్గ రామలింగేశ్వర స్వామి మరియు పాత బుగ్గ రామలింగేశ్వర స్వామి రథోత్సవాలు ఘనంగా నిర్వహించారు మూడు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు రథోత్సవం అనంతరం కొత్త బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం దగ్గర తెప్పోత్సవం నిర్వహించారు ఆలయ నిర్వాహకులు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు డోన్ డిఎస్పి పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ లు ఇంతియాజ్ భాష రాకేష్ ల పర్యవేక్షణలో ఎస్సైలు గట్టి బందు బస్తు నిర్వహించారు

## ఆర్డీవోని మర్యాదపూర్వకంగా కలిసి ఇంచార్జి కమిషనర్



**ఆత్మకూరు ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**
నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు పురపాలక సంఘం ఇంచార్జిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అవుకు ఓబులేష్, మంగళవారం రెవెన్యూ డివిజనల్ అధికారిని నాగజ్యోతిని మర్యాదపూర్వకంగా పూల పుష్పంతో అవుకు ఓబులేష్ కలిశారు ఈ సందర్భంగా పురపాలక సంఘంలో జరిగే అభివృద్ధి పనులు ప్రజా సమస్యలపై మున్సిపల్ కమిషనర్ తో ఆర్డీవో నాగజ్యోతి ప్రత్యేకంగా చర్చించుకున్నారు ప్రజా శ్రేయస్సు కోసం అధికార యంత్రాంగం పనిచేసే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ కు తెలియజేశారు వీరి వెంట ఇంజనీరింగ్ విభాగం ఏఈ షాహీర్, వెంకటరమణ రెవెన్యూ, మున్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు

## ప్రజలు నేరాలు.. దొంగతనాలు పట్ల జాగ్రత్త : ఎస్ఐ

**నందవరం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్తః**
సమాజంలో జరుగుతున్న మోసాల నేరాల దొంగతనాల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన నందవరం బస్టాండ్ ప్రాంగణంలో ప్రజలకు అవగాహన కార్య క్రమంచేపట్టారు. ముందుగా ప్రజలు చెడు వ్యవసనాలకు బానిసై కుటుంబాలను చిన్నబిన్నం చేయరాదన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకొని సమాజ ధర్మం గురించి పిల్లలకు తెలపాల న్నారు. పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదన్నారు. అంతేకాకుండా ఈమధ్య కాలంలో జరుగుతున్న దొంగత నాలు అరికట్టెందుకు ప్రతిఒక్కరు ఇళ్ళకు సీసీ పుటేజ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈకార్య క్రమంలో ప్రజలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆంజనేయుడికే.. ఎసరు పెడుతున్నారా..?

**: అధికారుల అత్యుత్సాహం..!**
**: విశ్వ హిందూ పరిషత్ కలెక్టర్ కు ఫిర్యాదు..!**
**: దేవాలయ ఆస్తులను కాపాడుకోవడం మా భాధ్యత**
**: విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత ఉపాధ్యక్షులు ఎర్రం విష్ణువర్ధన్ రెడ్డి**



**ఎమ్మిగనూరు ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :**
ఎమ్మిగనూరు నడిబొడ్డున.. అదీ కోతుల బావి ..ఆ ప్రాంతంలో దర్జాగా భూ దందా..! గిమ్మిక్కులతో జిమ్మిక్కులు చేసి లొసుగుల్ని అనుకూలంగా మలుచుకుని కోతుల బావి దేవాలయం ఆంజనేయ స్వామి స్థలానికి ఎసరుపెట్టింది ఎవరు..? దీని వెనక ఉన్నదెవరు అంటే బడా నేతలను అడ్డుపెట్టుకున్న ఓ అధికారి అని జగమెరిగిన సత్యం. వారిద్దరూ కలిసి ఈ స్థలంలో అత్యుత్సాహం తో చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు దుకాణాలు కట్టేసేందుకు ఆ ఇద్దరు కూడా సిద్ధమయ్యారంట. కోట్ల విలువైన ఈ భూమిని దక్కించుకున్న బడా నేతలు చోటా నేతలతో ముందస్తుగా అడ్వాన్స్ రూపంలో లక్షల్లో వసూలు చేసుకొని తమ ఖాతాల్లో వేసుకున్నారంట. ఈ స్థలం వ్యవహారం అంతా వారి కనుసన్నల్లోనే సాగుతోందని చర్చ చక్రం కొడుతుంది. పేరుకే ఆంజనేయ స్వామి ప్రాపర్టీస్.. కానీ, వెనుకుండి కథ నడిపేదంతా ఆ, (అధికారి) నేతలేనంట..! ఎలాంటి ఇబ్బందులు వచ్చినా క్షణాల్లో అధికారులకు ఫోన్లు చేసి క్లియరెన్సులు ఇప్పించుకుంటున్నారంట. అందులో అధికార పార్టీ సభ్యులు కావడంతో ఎవరూ అడ్డుచెప్పలేకపోతున్నారంట. రెవిన్యూ, పోలీస్, మునిసిపల్, సబ్ రిజిస్ట్రార్ విభాగాలన్నీ.. సదరు నేత దెబ్బకు నోరు మూసుకుని చేతులు కట్టుకుని కూర్చున్నాయన్నది అంతా చెబుతున్న మాట. కొంతమంది హిందూ సంఘాల నాయకులు కూడా మొదట వ్యతిరేకించినా.. ఆనేతల ప్రభావంతో సైలెంట్ అయిపోయారంట. దీంతో పనులు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఆయా శాఖల అధికారులు, నేతల అండదండలతోనే జోరుగా సాగిపోతున్నాయి. మరి దీనికి పరిష్కారం ఏంటి..? హనుమంతుడి గుడికి రక్షణ ఉందా..? పరిస్థితి ఏక్కడికి దారితీస్తోంది.? ఆ స్థలం కబ్జా కావాల్సిందేనా...? ఇలాంటి ప్రశ్నలకు కాలమే( ఆంజనేయుడే) సమాధానం చెప్పాలి. కలెక్టర్ కు ఫిర్యాదు..! దేవాలయ ఆస్తులను కాపాడుకోవడం మా భాధ్యత అని విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత ఉపాధ్యక్షులు ఎర్రం విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలోని సర్వే నెంబర్ 321 లో కోతులబావి గా ప్రసిద్ధి చెందిన శ్రీ భ క్త ఆంజనేయ స్వామి వారి దేవాలయం దశాబ్దాల నాటి నుండి పూజాది నిత్య కైంకర్యాలతో విరాజిల్లుతున్నది. ఈ దేవాలయానికి తూర్పు మరియు దక్షిణం రెండు వైపులా రోడ్లు ఉన్నాయి. అయితే విలేజ్ మ్యాప్ లో రోడ్డు వెడల్పు ఎక్కువగా ఉన్నట్టు చూపడం ద్వారా ఆ స్థలంలో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ షాపులు నిర్మించి గుడి రాకపోకలను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. కావున తమరు దయ ఉంచి గుడికి వెళ్లే దారిలో మున్సిపల్ కమిషనర్ పాతిన నాపరాల్ల ప్రహరీని వెంటనే తొలగింప చేసి గుడి రాకపోకలకు అంతరాయం కలిగించకుండా చూడగలరని , గుడి వ్యవహారంలో పోలీసు అధికారి దౌర్జన్యం చేయకుండా ఆదేశించాలని వారిరువురి పై , వారి వెనుక ఉన్న అరాచక శక్తులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము ..ఈ కార్యక్రమంలో దక్షిణాంధ్ర ప్రాంత సంయోజక పోలేపల్లి సందీప్, ప్రాంత విశేష సంపర్క ప్రముఖ తూముకుంట ప్రతాప్ రెడ్డి, ఆదోని జిల్లా అధ్యక్షులు అర్థగిరి బసవన గౌడ్ ఉపాధ్యక్షులు భీమారెడ్డి కార్యదర్శి హనుమంత రెడ్డి, ప్రచార ప్రసార ప్రముఖ కసిరెడ్డి ఉపేంద్ర, ధర్మ రక్షక్ నరసన్న, సహ కార్యదర్శి శ్రీరంగా, గోరక్ష ప్రముఖ్ శ్రీరాములు యాదవ్, అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి మురళి హిందూ బంధువులు పాల్గొన్నారు.

## తపాలా జీవిత బీమా.. గ్రామీణ తపాల జీవిత బీమాపై .. అవగాహన

**కర్నూలు,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:**



ఉలిందకొండ సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని బొల్లవరం గ్రామం బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ నందు తపాలా జీవిత బీమా గ్రామీణ తపాల జీవిత బీమా మీద అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్నూల్ డివిజన్ పోస్టల్ సూపరిండెండెంట్ జనార్దన్ రెడ్డి మరియు బొల్లవరం సర్పంచ్ జయన్న గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా సూపరిండెండెంట్ మాట్లాడుతూ.. పోస్ట్ ఆఫీస్ సురక్షితమైన పొదుపు, పెట్టుబడి మరియు భీమా పథకాలను అందిస్తుంది, ఇందులో ఆర్డి (నెలవారీ ఆదాయం), కిసాన్ వికాస్ పత్ర.. మరియు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటివి ముఖ్యమైనవి. ఇవి 6.6 నుండి 7.5 వరకు వడ్డీని, పన్ను మినహాయింపులను మరియు తక్కువ ప్రీమియంతో రూ. 10నుంచి15 లక్షల వరకు ప్రమాద భీమా రక్షణను కల్పిస్తాయని.. ప్రతి ఇంట్లో పోస్టల్ సేవలు దేశవ్యాప్తంగా కలిగి ఉన్నాయని ప్రజలు పోస్టల్ సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బొల్లవరం బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ నందు మహమ్మద్ షరీఫ్ అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్మాస్టర్ గా పనిచేస్తూ అనివార్య కారణాలవల్ల గత ఆరు నెలల కిందట మరణించడం జరిగింది ఆయన పోస్టల్ డిపార్ట్మెంట్లో ఐదు లక్షలకు ఇన్సూరెన్స్ పాలసీ చేయడం వల్ల అతని కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ డబ్బులు చెక్కు రూపంలో ఈరోజు కుటుంబ సభ్యులకు కర్నూలు పోస్టల్ సూపరిండెండెంట్ మరియు పోలవరం సర్పంచ్ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్మాస్టర్ షరీఫ్ పాలసీ తీసుకున్న 15 నెలలకు చనిపోవడం జరిగింది ఆయన దాదాపు 40 వేలు మాత్రమే చెల్లించడం జరిగింది. అతని కుటుంబ సభ్యులకు పోస్టల్ డిపార్ట్మెంట్ అతను చేసిన పాలసీకి బోనస్ తో సహా కలిపి 5,52,000 అతని భార్య అయినటువంటి సయ్యద్ పర్వీన్‌కి ఇవ్వడం జరిగింది అలాగే ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరికీ తపాల జీవిత బీమా పైన అవగాహన కల్పించి అందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పడం జరిగింది కార్యక్రమంలో పోస్టల్ ఇన్స్పెక్టర్ స్వామి నాయక్ మరియు పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



# న్యాయం ఉంటే.. నేను ఉన్నంత వరకు ఎవరికి అన్యాయం జరుగనివ్వను : భూమా

**: గెలివిబ్రద్రిశెట్టికుటుంబాని అండగా భూమా**

**నంద్యాల, ఫిబ్రవరి 17,ప్రభాతవార్తప్రతినిధి :**



నంద్యాలలో గెలివి,బద్రిశెట్టికుటుంబానికి నేను అండగా ఉంటానని న్యాయం ఉంటే నేను ఉన్నంత వరము ఎవరికి అన్యాయం జరుగనివ్వనని మాజీ యంయల్ఎ భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. నంద్యాల మున్సుపల్ అధికారులు చేసినఫున కార్యము మాజీ యంయల్ఎ భూమా బ్రహ్మానందరెడ్డి స్వయంగా పరిశీలించారు. ఒక స్థలానికి ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే స్థలానికి విఎల్టీ వేయడము గొడవలకు కారణము అయింది, గతంలో పదావతి నగరులో రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి యన్‌యండి ఫరూక్ స్థలంకు సంబంధించి మరొకరి స్థలం అని వారికి విఎల్టీ వేయడముతో వారి గుట్టు రట్టు కావడముతో ముగ్గురు మున్సుపల్ అధికారులు సస్పెండ్ అయ్యారు.అప్పట్లో ఈవిషం సంచలనముగా మారింది.మరి ఇప్పుడే గెలవి,బద్రిశెట్టి కుటుంబాలకు చెందిన 75 సెంట్ల స్థలముకు నకిలీ డాక్యుమెంటు సృష్టించి అస్థలం కొట్టివేయడానికి మున్సుపల్ అధికారులతో కుమ్మకుఅయిన అస్థలం ల్యాండ్ కన్వర్షన్ కాక పోయిన విఎల్టీ ఇవ్వడముతో సంచలనముగా మారింది. దీనితో సమస్య మాజీ యంయల్ఎ భూమా దృష్టికి గెలివి,బద్రీ శెట్టి కుటుంబాలు తీసుకుని వెల్లారు దీనితో భూమా స్వయంగా అక్కడికి వెల్లి విచారణ చేయగా మున్సుపల్ అధికారులు బండారము బట్టబయలు అయింది, గెలివి,బద్రిశెట్టి కుటుంబాలపెద్దలు 1984లో చాబోలు రస్తాలో 75 సెంట్లు కొనుగోలు చేశారు. అ స్థలం పై కొందరు కన్ను వేశారు. అ స్థలం మీదే అంటు దౌర్జన్యము గా కాంపౌండు వాలు పగలగొట్టి వారిపై గొడవలకు దిగి దాడి చేశారు. అప్పట్లో పోలీసులు కేసులు నమోదు చేశారు. అప్పటినుండి సైలెంటుగా ఉన్న మున్సుపల్ అధికారుల వద్ద ల్యాండ్ కన్వర్షన్ కానీ ఎలాంటి ప్రతాలు కాని లేకుండా అ స్థలానికి విఎల్టీవే యించుకున్నారు. గెలివి, బద్రిశెట్టి కుటుంబాలు న్యాయం కోసం మాజీ యంయల్ఎ భూమాను ఆశ్రయించారు. మంగళవారము ఉదయం అవతలి వర్గం మాకు విఎల్టీ ఉందని మరోమారుగోడను పగలకొట్టడముతో భూమా రంగప్రవేశము చేసి స్థలం వ్దకు వెల్లి పరిశీలించారు. అక్కడినుండే కమీషనరు పోన్ చేశారు. ల్యాండ్ కన్వర్పన ఎలా చేశారని ప్రశ్నించారు. దీనితో కమీషనరు నుండి ఎలాంటి సమాదానము లేదు. దీనితో భూమా విలేకర్లతో మాట్లాడుతూ గెలివి,బద్రిశెట్టి కుటుంబాలకు వారి స్థలం సమస్య నా దృష్టికి తీసుకుని వచ్చారని అన్నారు. అన్ని కరెక్టుగా ఉంటే వారికి అన్యాయం జరుగుకుంటే నేను ఉన్నానని చెప్పారు.ఇందుకు ఎంతదూరమైన పోతానని అయన చెప్పారు.

## అసెంబ్లీ సాక్షిగా.. ఆదోని జిల్లా డిమాండ్

**ఆదోని ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



ఆదోని డివిజన్ ప్రజల ఆకాంక్షను శాసనసభ సాక్షిగా ప్రజల వాణిని వినిపించిన ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పివి పార్థసారధి గారికి బిజెపి ఆదోని అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్ ధన్యవాదాలు తెలుపుతూ ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పశ్చిమ ప్రాంతానికి చెందిన ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలను కలిపి "రెండవ ముంబాయి"గా పేరుగాంచిన అభివృద్ధిలో వెనకబడిన ఆదోనిని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సమక్షంలో రెండవ సారి బలంగా గళం వినిపించిన ఆదోని ఎమ్మెల్యే డాక్టర్.పీవీ పార్థసారథి డిమాండ్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. పశ్చిమ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం, పరిశ్రమలు మరియు విద్య , వైద్యం , ఉపాధి అవకాశాల పెరుగుదల దృష్ట్యా ఆదోనిని జిల్లా చేయడం అత్యవసరమని...అలాగే పెద్ద హరివాణం, పెద్ద తుంబలం , మండలాలు కూడా విభజించాలని ఎమ్మెల్యే కోరడం హేతుపద్ధకమైనదే అన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మండలమైన ఆదోనిని రెండు మండలాలుగా విభజించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో పెద్ద హరివాణం, పెద్ద తుంబలం గ్రామాలను కూడా కొత్త మండలాలుగా ప్రకటించి ప్రజల సెంటిమెంట్లకు గౌరవం ఇవ్వాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అసెంబ్లీలో కోరారు.

## మహిళ ల భద్రత, రహదారి భద్రత.. నేరాల పై అవగాహన



**కర్నూలు ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి :**
ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ఆయా పోలీసుస్టేషన్ ల పరిధులలోని గ్రామాలను సందర్శించారు.మహిళల భద్రత , రక్షణ కు , రహదారి భద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులకు సైబర్ నేరాలు, శక్తి యాప్, నూతన చట్టాల పై అవగాహన కల్పించారు.ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే వారి భద్రత కోసం డయల్ 100, 112, 1930 వంటి హెల్ప్‌లైన్ నంబర్లుకు గాని, స్థానిక పోలీసులకు గాని సమాచారం అందించాలని వివరించారు.పోలీస్ సేవల గురించి వివరించారు. వాటికి ఏ విధంగా స్పందించాలో తెలియజేశారు.

## మైనార్టీ నాయకుడి మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళి



**బనగానపల్లె ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**
మండలంలోని హుస్సేనాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ పార్టీ మైనారిటీ నాయకుడు గద్దం లాలు సాహెబ్ (వయసు 75 సంవత్సరాలు) అనారోగ్యం కారణం తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి మంగళవారం వారి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.కార్యక్రమం లో, అవుకు మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి , ఎర్రగుడి రామ సుబ్బారెడ్డి మాధవరెడ్డి, హనీఫ్ భాష,శివనారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు

## తూతూమంత్రంగా ఉపాధి హామీ పథకము బహిరంగ సభ

**కోవెలకుంట్ల, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త :**
కోవెలకుంట్ల మండలంలో జరిగిన ఉపాది హామీ పథకము బహిరంగ సభ తూతూ.. మంత్రంగా నిర్వహించారు. మంగళవారము కోవెలకుంట్ల మండల పరిషత్ కార్యాలయ అవరణములో ఉపాది సామాజిక భద్రత తనిఖీ సభ నిర్వహించారు. ఇందులో పిడి సూర్యనారాయణ, ఎపిడి సాంబశివరావు, క్వాల్టీ కంట్రోల్ అదికారి చంద్రశేఖరు. ఎపియంలు శ్రీకళ, శ్రీవిద్యలు పాల్గొన్నారు. ఈసందర్భముగాగ్రామాల వారిగా సామాజిక భద్రత తనికీలు చేసిన వాటిని సభలో చదివి వినిపించారు. అందులో మండలంలో 9 కోట్లు పనులు చేయగా రికవరి మాత్రము కేవలము23665 మాత్రమే చేయడము పెద్ద అశ్చర్యానికి గురి చేసస్తోంది. మొత్తం మీద తూతూమంత్రంగాసభ నిర్వహించారని సమాచారం.

